

సాంకేతికతతో చెత్త నుంచి విద్యుత్

అరసవల్లి: సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటే గ్రామీణ ప్రాంతాల్లోనూ సమగ్రాభివృద్ధి సాధించవచ్చని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే వినూత్న ప్లాంట్‌కు తడేపేవలసలో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారుగా 20 కోట్ల వ్యయంతో ఎన్విరో వేస్ట్ సొల్యూషన్స్ అనే సంస్థ డిజైన్ బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఈ ప్లాంట్‌ను నిర్మించనుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతిరోజూ సుమారు 50 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేసి విద్యుత్, నీరు, ఎల్‌పిజి వంటి ఉప ఉత్పత్తులుగా మారుస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, ఎన్విరో సంస్థ ప్రతినిధులు రితేష్ మున్నీ, మంత్రిత్ సింగ్, మోహనరావు పాల్గొన్నారు.



వేటకు విరామం

సముద్రంలో చేపల వేటపై సోమవారం అర్ధరాత్రి నుంచి నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. ఈ సమయంల్లో వేట సాగిస్తే మత్స్య సంపద దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా వేటకు విరామన్ని ప్రకటిస్తూ వస్తోంది. చేపల వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు ప్రభుత్వం 61 రోజుల కాలానికి గత నాలుగేళ్లలో రూ.పది వేలు భృతి డబ్బులు అందేవి. గతేడాది సంబంధించిన వేట నిషేధ పరిహారం డబ్బులు మత్స్యకారుల ఖాతాల్లో నేటికీ జమ కాలేదు. ఇదిగో అదిగో పరిహారం చెల్లిస్తామంటూ టిడిపి కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తూ వచ్చింది. చివరకు ఈనెలలో చెల్లిస్తామని ప్రకటించింది. ఒక ఏడాది డబ్బులు ఇస్తుందా? లేదా?, రెండేళ్లకు సంబంధించిన సొమ్ములను అందిస్తుందా అనే విషయంలో స్పష్టత కనిపించడం లేదు.

- **నేటి నుంచి 61 రోజుల పాటు చేపల వేటపై నిషేధం**
- **గతేడాది పరిహారం నేటికీ అందని వైనం**
- **సర్వేపై విడుదల కాని మార్గదర్శకాలు**

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని 11 మండలాల్లో 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. చేపల వేట ప్రధాన వృత్తిగా సుమారు 25వేల కుటుంబాలు బతుకుతున్నాయి. చేపల వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు ప్రభుత్వం 61 రోజుల కాలానికి రూ.పది వేలు చొప్పున ఏటా క్రమం తప్పకుండా అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మేలోనే చెల్లింపులు జరిగేవి. గతేడాదికి సంబంధించి ఇప్పటివరకు మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం డబ్బులు ఇవ్వలేదు. కొన్ని పాలనాపరమైన ఇబ్బందులతో పాటు టిడిపి కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తుండడంతో, మత్స్యకారులు గతేడాది సాయానికి నోచుకోలేకపోయారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో లబ్ధిదారుల సర్వేను చాలా ఆలస్యంగా చేపట్టడంతో గతేడాది జూన్ రెండో తేదీనే అధికారులు జాబితాను పంపారు. రాష్ట్రంలో గతేడాది జూన్‌లో కొత్తగా కొలువుదీరిన టిడిపి కూటమి ప్రభుత్వం చెల్లింపులు మాని రీ సర్వే చేయాలని గతేడాది సెప్టెంబర్‌లో అధికారులను ఆదేశించడంతో చెల్లింపు వాయిదా పడ్డాయి. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితాలో తప్పిపోయిన మత్స్యకారుల వివరాలను గతేడాది నవంబరులో పంపారు. ఆ జాబితా ప్రకారం జిల్లావ్యాప్తంగా 15,375 మంది మత్స్యకారులను సర్వే చేశారు. నవంబరులో రీ సర్వే చేసిన తర్వాత వీరికి అదనంగా 65 మందికి పైగా మత్స్యకారులు జాబితాలో చోటు దక్కింది. దీంతో మొత్తం 15,440 మంది మత్స్యకారులను అర్హులుగా ప్రభుత్వం గుర్తించి, వారికి మాత్రమే పరిహారం అందించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎన్నికల హామీ మేరకు పరిహారాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పరిహారం సొమ్ములు ఎప్పుడు అందిస్తారు?, రెండేళ్లకు సంబంధించిన వేట నిషేధ డబ్బులు ఇస్తారా? అనే విషయంలో స్పష్టత లేదు.

అమల్లోకి డీజిల్ వాడకం నిబంధన

మత్స్యకార భరోసాకు చెల్లింపుకు గత వైసిపి ప్రభుత్వం 2023 నుంచి కొత్తగా డీజిల్ వాడకాన్ని మెలిక పెట్టింది. మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం ఏడాదికి లీటరుకు రూ.9 చొప్పున సబ్సిడీతో 300 లీటర్ల డీజిల్‌ను అందిస్తోంది. కనీసం వంద లీటర్లను కూడా వినియోగించని వారిని అనర్హులుగా గుర్తించాలని అధికారులకు సూచించింది. 2023 సంవత్సరానికి మినహాయింపునిచ్చినా 2024 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం దాన్ని అమలు చేయనుందని సమాచారం.

ఇతర నిబంధనలతో ఐదు వేల మంది అనర్హులు

మత్స్యకార భరోసాకు ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలనే టిడిపి కూటమి ప్రభుత్వం అనుసరించనున్నట్లు తెలుస్తోంది. విద్యుత్ వినియోగం, ఆదాయపు పన్ను, ఇంట్లో ఎవరైనా ఉద్యోగం చేస్తున్నా, పల్లం భూమి అయితే మూడెకరాలు, మెట్టు అయితే పది నిబంధనలతో జాబి తాను కుదించినున్నట్లు తెలుస్తోంది.

మార్గదర్శకాల కోసం చూస్తున్నాం

వేట నిషేధ పరిహారం చెల్లింపులపై స్పష్టత రాలేదు. ఈ వారంలో మార్గదర్శకాలు వస్తాయని అనుకుంటున్నాం. చేపల వేటపై ప్రభుత్వం ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు నిషేధం విధించింది. చేపలు, రొయ్యలు సంతనోత్పత్తి కాలం నేపథ్యంలో ప్రభుత్వం ప్రతి ఏడాది వేట నిషేధాన్ని అమలు చేస్తోంది. నిబంధనలను ఉల్లంఘించి వేటకు వెళ్తే బోట్లతో పాటు మత్స్య సంపద స్వాధీనం చేసుకుంటాం. నిషేధిత సమయంలో వేటకు వెళ్లిన వారికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం, ప్రభుత్వం అందించే రాయితీతో పాటు అన్ని రకాల సౌకర్యాలు నిలిపివేస్తాం.

- వై.సత్యనారాయణ,
మత్స్యశాఖ ఉపసంచాలకులు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

అంబేద్కర్ జీవితం నేటి తరానికి స్ఫూర్తి

కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు

ప్రజాశక్తి – శ్రీకాకుళం

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, బాబా సాహెబ్ అంబేద్కర్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద సాంఘిక సంక్షేమ శాఖ, నగరపాలక సంస్థ సంయుక్తంగా నెలకొల్పిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ కళావేదికలో ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తితో పాలన సాగిస్తోందన్నారు. సంక్షేమ పథకాల్లో సగానికి పైగా బడుగు, బలహీన వర్గాలకు అందిస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందుకుని సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా ప్రతిఒక్కరూ ఎదగాలన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. అంబేద్కర్ అడుగుజాడల్లో ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే దానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, దళిత సంఘ సీనియర్ నాయకులు బొడ్డేపల్లి నర్సింహులు, పి.ఎం.జె బాబు, తైక్వాండో శ్రీను, కంఠ వేణు, మట్టా పురుషోత్తం, బోసు మన్మథరావు, ఎస్.వి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ధనలక్ష్మి

ఒప్పంద జిఒలను అమలు చేయాలి

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనలక్ష్మి

ప్రజాశక్తి – శ్రీకాకుళం

వైద్యారోగ్య సేవల్లో కీలకంగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు పనికి తగిన వేతనంతో పాటు గతంలో ఇచ్చిన ఒప్పంద జిఒలను తక్షణమే అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనలక్ష్మి ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో 'ఆశా వర్కర్లు సాధించిన విజయాలు –సవాళ్లు' అనే అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ స్కీమ్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయినా ఆశాలకు కనీస వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చాలా మంది ఆశావర్కర్లు మృతి చెందినా, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.పది లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ఏడేళ్ల కాలంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆశాలకు రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంచిందని, గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పెంచలేదని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధుల కేటాయింపులు నానాటికీ తగ్గుతున్నాయని, ప్రజారోగ్యానికి భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులతో ఆశాలను తొలగించేందుకు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నట్లు గుర్తుచేశారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి సమిష్టిగా పోరాడాలన్నారు. మేడే దినోత్సవాన్ని పోరాట స్ఫూర్తితో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న 44 లేబర్ కోడ్‌లను రద్దు చేసి నాలుగుగా మార్పు చేయడం వల్ల కార్మికుల మెడకు ఉరితాడులా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ఈ చట్టాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, నాయకులు పి.జయలక్ష్మి, లావణ్య, రాకోటి.సుజాత, పార్వతి, సుధ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి బిజెపి కూటమి తూట్లు

ప్రజాశక్తి – ఎచ్చెర్ల

కేంద్రంలోని బిజెపి కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచి మనువాదాన్ని అమలు చేయాలని చేస్తున్న ప్రయత్నాలను ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఎచ్చెర్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి అని అన్నారు. పదేళ్లుగా మోడీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రాల అధికారాలను తన గుప్పిట్లోకి తీసుకుంటోందన్నారు. ఫెడరలిజాన్ని సంరక్షించుకుంటేనే దేశ సమైక్యత, సమగ్రత కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను ఎదుర్కొని రాజ్యాంగ మౌలిక, లౌకిక స్వభావాన్ని సంరక్షించుకోవడంతో పాటు రాజ్యాంగ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లడమే అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల గ్రామ సర్పంచ్ టి.లక్ష్మణరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.బంగార్రాజు, సంఘాల నాయకులు లక్ష్మణరావు, ఎన్.రమణ, రాము, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రణస్థలం : లౌకిక రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి అని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ అన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా పతివాడపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సాకేటి పోతయ్య, ఎం.అప్పన్న, గ్రామపెద్దలు దాలినాయుడు, పి.సత్యం, వి.శ్రీరామ్, రామకృష్ణ, ఎస్.రాములు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సిపిఎం నాయకులు పోలాకి ప్రసాదరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోసి రామారావు, పి.ప్రసాదరావు, పి.రమేష్, ఆర్.దాలయ్య, రాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి అదిఆంధ్రా వీధిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య, యర్ర వెంకటరావు, యాగాటి శివరావు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మెట్టూరిలోని అంబేద్కర్ విగ్రహానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరరాపు సింహాచలం, వైసిపి నాయకులు, చింతాడ సూర్యనారాయణ, మొజ్జాడ చక్రపాణి, బి.శ్రీను పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పాస్టర్ల మధ్య ఆధిపత్య పోరు

- **ఆలయాల గోడలపై రాతలకు అదే కారణం**
- **మతపరమైన అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు**
- **ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి**

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి, అరసవిల్లి

జలుమూరు మండలం యలమంచిలిలోని పలు ఆలయాల గోడలపై రాతలకు ఇద్దరి పాస్టర్ల మధ్య ఆధిపత్యమే కారణమని ఎస్‌పి కె.వి మహేశ్వరెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యలమంచిలి పాస్టర్ చొక్కపు శంకరరావు యలమంచిలిలోని ఓ పోస్టుమాస్టర్ ఇంటిలో ప్రతి ఆదివారం ప్రార్థనలు చేస్తుంటారు. యలమంచిలిలో చర్చి ఏర్పాటు కోసం శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ పాస్టర్ 0.30 సెంట్ల భూమి కొనుగోలు చేశాడు. యలమంచిలిలో చర్చి నిర్మాణం జరిగి చొక్కపు శంకరరావును పాస్టర్‌గా నియమిస్తే బుడితి చర్చికి రావాల్సిన వారు తగ్గిపోయి, కానుకలు రాకుండా పోతాయని బుడితి చర్చి పాస్టర్ జాన్ పీటర్ భావించాడు. పాస్టర్ శంకరరావును ఏదోవిధంగా గ్రామం నుంచి వెళ్లగొట్టించాలని జాన్ పీటర్ భావించాడు. చర్చి నిర్మాణం జరగకుండా చేయాలని ప్లాన్ చేశాడు. తనకు తెలిసిన ఆటో డ్రైవర్ పాగోటి ఈశ్వరరావును సంప్రదించగా, ఆయన తన చిన్ననాటి స్నేహితుడు పెయింటర్‌గా పనిచేస్తున్న అజయ్ గురించి చెప్పగా వీరిద్దరితో పీటర్ మాట్లాడారు. యలమంచిలి చుట్టుపక్కల ఉన్న హిందూ ఆలయాలపై యేసు ప్రభువుకు సంబంధించిన వాక్యాలు రాయాలని పురమాయించారు. వారిద్దరూ యండల కామేశ్వరి స్వామి గుడి లోపల ఉన్న ప్రహరీపై ఏసుకు సంబంధించిన రాతలు రాశాడు. వీటితో పాటు కామినాయడు పేట అంజనేయ స్వామి గోడలపై రాతలతో పాటు కొండపోలవలస అంజనేయ స్వామి ఆలయ గోడ పై శిలువ గుర్తులు వేశారు. యలమంచిలికి చెందిన వెంకటరమణ అనే పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జలుమూరు పోలీసులు గత నెల 30న కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు తొమ్మిది బృందాలుగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నిందితులు పాగోటి ఈశ్వరరావు, మామిడి అజయ్, చందక దేముడు నాయుడును సోమవారం అరెస్టు చేశారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. నరసన్నపేట, కొత్తూరు, టెక్కలి శ్రీనివాసరావు, ప్రసాద్, విజయ్ కుమార్, సిసిఎస్ సిఐ చంద్రమౌళి జలుమూరు, నరసన్నపేట ఎస్ఐలు అశోక్, దుర్గాప్రసాద్‌లను ప్రశంసించారు. అడిషనల్ ఎస్‌పి (క్రైమ్) పి.శ్రీనివాసరావు కేసును పర్యవేక్షించారు.

వాడవాడలా అంబేద్కర్ జయంతి



శ్రీకాకుళం : అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న అజ శర్మ

ప్రజాశక్తి- అరసవల్లి

భారతదేశ రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.అర్. అంబేద్కర్ 134వ జయంతి పురస్కరించుకొని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని, ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రపంచానికి ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని రూపొందించి భారతదేశానికి అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేద్కర్ అనికొనియాడారు. కార్యక్రమంలో ఆర్మ్ రిజర్వ్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, సిఐ శ్రీనివాస్, అర్‌ఐ నర్సింగరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిఆర్ఒ ఎం,వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతిలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిసెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో

బహుమతి ప్రజ్ఞాశాలి ప్రపంచ దేశాలలో ప్రముఖ వ్యక్తిగా వెలుగొందిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షులు అజ శర్మ అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్ అధ్యక్షతన అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ప్రశ్నించే తత్వం ఉన్నప్పుడు సమాజం అభివృద్ధి చెందుతుందని పాలకులు భయపడతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర సిఐటియు కార్యదర్శి ధనలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, సిఐటియు ఉపాధ్యక్షులు నాగమణి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు చౌదరి రవీంద్ర, జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, సూర్య ప్రకాశరావు, జి.సురేష్ రాష్ట్ర కౌన్సిలర్లు అప్పారావు, ఉమాశంకర్, బయాలజీ ఫోరమ్ అధ్యక్షులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన గల అంబేద్కర్ విగ్రహానికి డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొచ్చ వెంకటరమణ, మామిడి సత్యనారాయణ, డిసిసి ప్రధాన కార్యదర్శులు కెవిఎల్ఎస్ ఈశ్వరి, సాయి దుల్లాఖాన్, జిల్లా బిసిసెల్ అధ్యక్షుడు అంబటి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వైకె ఆధ్వర్యాన ...

యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లైఫ్ ఫ్యూయల్ సర్వీసు ఆర్గనైజేషన్ సంయుక్తంగా ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురేఖ, నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాళ్ల ఆర్. శ్రీనివాస పాత్రో, డా. బిఎన్‌వి చలమయ్య, సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు పర్యాటకశాఖ అధికారి ఎన్. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

పట్టణంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహశీల్దార్ పందిరి అప్పారావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ అరవింద్, డాక్టర్ పైడి సింధూర, జెమ్స్ అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రామారావు, వాకర్స్ గవర్నర్ కొంఖ్యాన మురళీధర్, గాంధీ మందిరం ప్రతినిధులు మేడూరి ప్రసాదరావు, జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహానికి జాతీయ రెల్లి సంఘ అధ్యక్షులు సుధాకర్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు అర్జి ఈశ్వరరావు, ఆర్‌టిసి ఈశ్వరరావు, అర్జి తిరుపతిరావు, పాపారావు, యోగి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన ...

ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంబేద్కర్ విగ్రహానికి స్టార్ వాకర్స్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జి.నారాయణరావును సత్కరించారు. కార్యక్రమంలో గేదెల ఇందిరా ప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోటో: నారాయణ రావును సత్కరిస్తున్న వాకర్సు

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ జర్నలిస్టు సంఘం ఆధ్వర్యాన

అంబేద్కర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద గల పూలేపార్కులో అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ జర్నలిస్టు సంఘం అసోసియేషన్ అధ్యక్షులు గంజి ఎజ్రా పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కెవెన్ మూర్తి, బమ్మిడి వేణు, గొండు మణికుమార్, రాయి రాము, పరిడాల పద్మభూషణ్ సాయి, మోహన్, సురేష్, నీలి కిరణ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: అంబేద్కర్ మార్గం అనుసరణీయమని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, బొడ్డేపల్లి గౌరీపతిరావు, నూకరాజు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, అన్నెపు భాస్కరరావు, నేతింటి జ్యోతి, గొండు రమణ, సనపల చెల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద నున్న వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఖండాపు గోవిందరావు, దుంపల శ్యామ్, సువ్వారి నేతాజీ బిట్టు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద నున్న కార్యాలయంలో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సువ్వారి అనిల్, అన్నెపు సూర్యనారాయణ, బొడ్డేపల్లి గోవిందరావు, వై.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నున్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సనపల అన్నాజీరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు.

లావేరు: అంబేద్కర్ అసాయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. లావేరు కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి ఎం.వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, నాయకులు లుకలాపు అప్పల నాయుడు, లంకలపల్లి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ కార్యాలయంలో బిఆర్ అంబేద్కర్ జయంతి నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని పొందూరు మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని సుంకర పేటలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ జగాది శ్రీరామమూర్తి, కోరుకొండ రామినాయుడు, పైడి శ్రీరామమూర్తి, పేడాడ దాసు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: అంబేద్కర్ అందరివాడని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. మండలంలోని బోరివంకలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎంపిడిఒ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి, కవిటి బస్టాండ్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బెందాళం రమేష్, పొందర కృష్ణ పూలమాలలు వేశారు. బెజ్జిపుట్టుగలో దాతల సహకారంతో స్వర్గీయ బొర్ర అప్పలరాజు మాస్టారి ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు.

నరసన్నపేట: పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోలాకి: పోలాకిలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ డోల జగన్, మండల పార్టీ అధ్యక్షులు మిరియపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గౌతు శిరీష పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాసరావు, దడియాల నర్సింహులు, కొండ నర్సింహులు పాల్గొన్నారు. మొగిలిపాడు నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆల్ ఇండియా ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు జగన్నాయకులు, జిల్లా జెఎసి అధ్యక్షులు సవర రాంబాబు, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండల అధ్యక్షులు పి.ఈశ్వరరావు, ముఖ్య సలహాదారులు సుందరాడ ఎర్రంనాయుడు, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నంబరు ఎస్.మోహనరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖరరావు, ఎగ్జిక్యూటివ్ నంబరు ఎస్.రామారావు, జై.రామారావు, విశ్రాంత ఎసిఐ ఎస్.శ్రీరంగ్, ఆర్‌టిసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి. వరాహులు, డిటి కిరణ్ కుమార్, ఎస్.లోకేష్ పాల్గొన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, డిప్యూటీ నాగు, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కోత పూర్ణచంద్రరావు, ఆట్టాడ వాసు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలకృష్ణారావు, మాజీ ఎంపిపి ఎర్ర చక్రవర్తి, వైసిపి మండల అధ్యక్షులు బీతాల పాల్గొన్నారు. సింగుపురంలో ఎపి మాలమహానాడు జిల్లా అధ్యక్షులు టుంగాన తిరుపతిరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండి ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిడిఒ రమేష్‌నాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపలి ఉదయకుమార్, ఎంపిటిసి కామేష్, సర్పంచ్ కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : నగరంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అభిమన్యు, హెచ్.డిల్లేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, వరద, సురేష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

మండలంలోని సీతాపురం పంచాయతీ ఒలియాసాగరంలో మోహనరావు సహాయంతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కింజరాపు హరివరప్రసాద్ ఆవిష్కరించారు. అలాగే స్థానిక అంబేద్కర్ విగ్రహానికి దళిత జెఎసి నాయకులు పూలమాలలు వేశారు.

మెళియాపుట్టి: మండలంలో గొప్పిలిలో వైద్యులు సలాన శరత్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, జనసేన నాయకులు దుక్క బాలరాజు, పెద్ద పద్మాపురంలో ఎంపిటిసి ప్రతినిధి ఉర్లన బుచ్చి, సర్పంచ్ ప్రతినిధి మామిడి శ్రీధర్, కార్యకర్తలు అప్పారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : స్థానిక బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ పూలమాలలు వేశారు. అనంతరం ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పంటకు సోకిన తెల్ల దోమ నివారణ చర్యలు తీసుకోవాలని, కొబ్బరి రైతులను ఆదుకోవాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.

దళిత నాయకులు సల్ల దేవరాజ్, భాగమోహనరావు, బాగా జయపతి, గుండ్ర దేవరాజ్, దద్ద శ్యాంసుందర్, వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్, లోహిదాస్, లండ శేఖర్, బొచ్చు జగన్, చుక్క లక్ష్మీనారాయణ, ఎంపిపి బోర పుష్ప, మాజీ ఎంపిపి కారంగ మోహనరావులు, కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.నరేంద్రనాథ్ పట్నాయక్‌లు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు.



శ్రీకాకుళం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

సంతబొమ్మాళి : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ కె.మధు, సర్పంచ్ కె.లక్ష్మి, దళిత నాయకులు రేవున్న ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమా రావు, రెడ్డి అప్పన్న, కె. తాతారావు, ఎం. అప్పా రావు, భానుప్రకాశ్ పాల్గొన్నారు.



పలాస : అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గిరిజన సంఘ నాయకులు

కోటబొమ్మాళి: స్థానిక అంబేద్కర్ విగ్రహానికి మండల పరిషత్ అధ్యక్షురాలు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు పూలమాలలు వేశారు. అలాగే అంబేద్కర్ సేవా సమితి సభ్యులు బి.ఆజ్జన్న, డి .సింహాచలం, ఎస్.సంజీవరావు, కె.మల్లేసు, కళ్ళ సంజీవరావు, సిమ్మయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. టిడిపి నాయకులు కింజరాపు హరిప్రసాద్, తర్ర రామకృష్ణ, బాడాన రమణమ్మ, సురేష్, బోర అప్పారావులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

కొత్తూరు : మండలంలోని సిరుసువాడలో అంబేద్కర్ విగ్రహాన్ని వైస్ ఎంపిపి లోతుగడ తులసీవరప్రసాదరావు ఆవిష్కరించారు అలాగే తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రవిచంద్ర చిత్రపటానికి పూలమాలలు వేశారు.

మందస : మండలంలోని అంబేద్కర్ విగ్రహానికి యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు జన్ని సోమేశ్వరరావు, ప్రజా విజ్ఞాన వేదిక మందస కన్వీనర్ మార్పు జగన్మోహనరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ సెల్ కోఆర్డినేటర్ కె.మాధవరావు, ప్రజా విజ్ఞాన వేదిక మండల నాయకులు ఎం.కోదండరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కె.గంగారావు, యుటిఎఫ్ మండల పూర్వ అధ్యక్షులు పి.కొండలరావు, జిల్లా కౌన్సిలర్లు తరిణి సోమేశ్వరరావు, గున్న రాజు, టి.గంగారావు, జి.కృష్ణారావు, ఎం.రవీంద్ర, నారాయణరావు, మామిడి గణపతి పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, అలాగే బీడి అంబేద్కర్ సేవా సంఘం నాయకులు, సర్పంచ్ సేపతి దివ్యలు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

పొందూరు: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పియుసి చైర్మన్ కూన రవికుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. పట్టణంలో పొందూరు, జి.సిగడం ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌పి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీర రాము, ప్రధాన కార్యదర్శి రేగడి సతీష్, గౌరవ అధ్యక్షులు సాకేటి నాగరాజు, అసోసియేషన్ సభ్యులు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



లావేరు : నినదిస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- లావేరు

మధ్యాహ్నం భోజన పథకం వంట కార్మికులకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని, పెండింగ్ వేతనాలు, వంట బిల్లులు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, ఎపి మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్ చేశారు. లావేరులో మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్, సిఐటియు సమావేశం నిర్వహించారు. ముందుగా డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా హైస్కూల్ ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకంలో పనిచేస్తున్న వారు అట్టడుగు వర్గాలకు చెందినవారని, కేవలం రూ.3 వేలు తక్కువ వేతనాలతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు భారీగా పెరుగుతున్నాయని వేతనాలు, మెనూ చార్జీలు మాత్రం పెరగడం లేదన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజన పథకంలో ధరల పెరుగుదలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.20 మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. గత ఐదు నెలలుగా రాగిమాల్ట్ బిల్లులు చెల్లించలేదని, 100 మంది విద్యార్థులకు ఇద్దరు వర్కర్లు ఉండడం వలన వర్లపైన పనిభారం ఎక్కువవుతుందని, వర్కర్ల సంఖ్య పెంచాలన్నారు. 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు భోజనం వండి పెట్టే వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల 5వ తేదీ లోపల వేతనాలు, బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించకూడదని, మంచినీరు, వంట షెడ్డు, గ్యాస్ స్టవ్ ప్రభుత్వం కల్పించాలని, ఏడాదికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, రెండు నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఇఒలు సమావేశాలు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీకాకుళం: కంచిలి మండలంలో మధ్యాహ్న భోజన వంట కార్మికులతో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులు వేతనాలు, వంట బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, నెలవారి జీతాలు, బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వంట నిర్వాహకులపై రాజకీయ ఒత్తిడి లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు తులసి, గీత, దాలమ్మ, చింతామణి, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా...



రక్తదానం చేస్తున్న యువకులు

కవిటి: తలసేమియా, కిడ్నీ బాధితులకు జిల్లా బెంతు ఒరియా సంఘం కవిటి బస్టాండ్ ఎదురుగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించింది. హెల్పింగ్ హేండ్స్ సభ్యుల సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బెంతు ఒరియా యువజన సంఘం అధ్యక్షుడు సుమన్ బిసాయి, బందావన్ బిసాయి, శ్రీరామ్మూర్తి, కాళీ సాహు, లక్ష్మణ్, విశ్వేష్, దేవరాజ్, బెంతు ఒరియా విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

సముద్రంలో వేట నిషేధం

నరసన్నపేట: ఏప్రిల్ 14 అర్ధరాత్రి 12 గంటల నుంచి జూన్ 15 అర్ధరాత్రి 12 గంటల వరకు వేట నిషేధం అమలులో ఉంటుందని ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమయంలో సముద్రంలో మత్స్యకారులు మోటారు పడవలతోను, మేకనైజ్ బోటులతోను, వేటలు అనేవి సాగించకూడదన్నారు. ఇలా ఎవరైతే వేటను చేస్తారో వారి బోటు రిజిస్ట్రేషన్ ఏడాది పాటు రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే మరే ఇతర పథకాలూ నిలుపుదల చేస్తామన్నారు. 61 రోజుల పాటు మత్స్యకారుల పడవలను, బోట్లను సముద్ర తీరంలో లంగరు వేయాలన్నారు. వేట నిషేధ భృతి ఒక్కొక్కరికీ రూ.20 వేలు అందిస్తామన్నారు. ఈయనతో పాటు గ్రామ మత్స్య సహాయకులు డాక్టర్ ఢిల్లేశ్వరరావు, అయ్యప్ప, వెంకటేష్, కృష్ణ, సాగర్ మిత్రులు ఉన్నారు.



సురేష్ కుమార్

అగ్నిమాపక సిబ్బంది సేవలు అమూల్యం




రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

అగ్నిమపాక సిబ్బంది సేవలు ఎంతో విలువైనవని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. సోమవారం అగ్నిమాపక అధికారి పైల అశోక్ ఆధ్వర్యంలో అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక శాఖ వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్మారక స్తూపం వద్ద నివాళ్లర్పించి మౌనం పాటించారు. అనంతరం మాట్లాడుతూ అహర్నిశలు అగ్నిమాపక సిబ్బంది ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడడానికి చేస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవని కొనియాడారు. అగ్నిమాపక కరపత్రాన్ని ఆవిష్కరించి అగ్నిమాపక వాహనాన్ని స్వయంగా నడిపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమపక అధికారి జె.మోహనరావు, జె.ఆర్.పురం ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది ఉరిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను ఎస్ఐ బుచ్చోడు సోమవారం ప్రారంభించారు. అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ నెల 20 వరకు వారోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. అనతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్యులు పాలవలస శశిభూషణ్‌రావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన వాసుదేవరావు

కోటబొమ్మాళి: మండల కేంద్రం కోటబొమ్మాళిలోని స్టేట్ బ్యాంకు వెనుక, ప్రకాష్‌నగర్ కాలనీ సమీపంలో చెట్టుకు పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన కోరాడ వాసుదేవరావు (58) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ప్రకాశనగర్‌కాలనీలో నివాసం ఉంటూ చిన్నచిన్న వంట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడుకు కూమారుడు పవన్ ఉన్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరు కొని మృతుడు కుమారుడుకు సమాచారం అందజేసి పోస్టుమార్గానికి స్థానిక ప్రభుత్వా స్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి బలవన్మరణం



ధర్మారావు మృతదేహం

సోంపేట: మండల కేంద్రంలోని గాంధీ నగర్ వీధికి చెందిన గేదెల ధర్మారావు (47) ఆదివారం రాత్రి ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీనగర్‌కు చెందిన ధర్మారావు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య మోహిని, ఏడో తరగతి చదువుతున్న త్రిశాంక్, ఐదో తరగతి చదువుతున్న రితేష్ ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ధర్మారావు రాత్రయిన చేరుకోలేదు. భార్య, పిల్లలు చుట్టుపక్కల వెతికారు. సోమవారం ఉదయం గొల్లవాని చెరువు వెనుక తోటల్లో చెట్టుకు ఉరిపోసుకొని వేలాడుతన్న మృతదేహాన్ని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోంపేట ఎస్ఐ లవరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ధర్మారావు అప్పుల బాధ తాళ్లలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని తోటి మోటార్ యూనియన్ నాయకులు చెబుతున్నారు.

క్రైమ్ కార్నర్

చెరువులో మునిగి వ్యక్తి మృతి

కొత్తూరు: స్థానిక మేదరవీధికి చెందిన ఆర్.గడ్డయ్య (49) నివగాం రోడ్డు ముగితివాని చెరువులో పడి మృతి చెందారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని వైపులా వెతికారు. ఎక్కడా జాడ కనిపించలేదు. ఉదయం వీధి వాసులు బహిర్భూమికి వెళ్లగా చెరువులో మృతదేహాన్ని తేలియాడుతూ కనిపించింది. వెంటనే గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రమణమ్మ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. ఎస్ఐ కేసు మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి మూర్ఛ వ్యాధి ఉండడంతో బహిర్భూమికి వెళ్లిన సమయంలో చెరువులో పడి మృతి చెంది ఉంటారని కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

నందిగాం : నందిగాం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాల్యాయి. గోల్లూరుకు చెందిన ఎ.అప్పలరాజు తన సొంత పనుల నిమిత్తం బైక్ వెళ్తున్నాడు. వెనుక నుంచి వస్తున్న లగేజ్ వాహనం బలంగా ఢీకొనడంతో అప్పల రాజుకు తలకు తీవ్ర గాయమైంది. వెంటనే 108లో టెక్కలి జిలా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

మహిళలను గౌరవించే సినిమాలు తీయాలి

పలాస: సమాజంలో మహిళకు గౌరవం, మర్యాదలు లభించేలా సినిమాలు తీయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ విద్యా వాహిని కళాశాలలో నటుడు, నిర్మాత, దర్శకుడు మోహన్ భరద్వాజ్ నేతృత్వంలో ఎపి తెలుగు ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్ అధ్యక్షతన 'పాంచాలి' సినిమా ట్రయలర్, పాటలను సోమవారం ఆవిష్కరించారు. అలాగే సినిమా పోస్టర్లను బృందంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినిమాతో సమాజానికి ఒక మంచి సందేశం ఉండేలా నిర్మాణం చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎన్ని కోట్లు వ్యయంతో సినిమా తీసిన రోజుల వ్యవధిలో సినిమాలు పైరసీ అవుతున్నాయని, వీటి ద్వారా నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిపిసి రాష్ట్ర చైర్మన్ వజ్జి బాబూరావు, దర్శకుడు, నిర్మాత మోహన్ భరద్వాజ్, పాటల రచయత జి. సాంబమూర్తి, జి.వినయ్‌కుమార్, విద్యావాహిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.తిరుమలరావు, ఎఒ గిరిబాబు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, పి.విఠల్‌రావు, గాలి కృష్ణారావు, చంద్రమౌళి, సురేష్ బాబు పాల్గొన్నారు.



సినిమా ట్రైలర్‌ను చూస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

బిసిల అభ్యున్నతే లక్ష్యం

శ్రీకాకుళం: దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో బిసి జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడంలో వెనుకబాటుకు గురై ఉన్నామని, సమిష్టి ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోగలమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లాకా వెంగళరావు అన్నారు. సోమవారం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కిల్లాన టవర్స్‌లో బిసి సంక్షేమ సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బిసి సంక్షేమ సంఘం రాజకీయాలకు అతీతంగా బిసిల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. బిసిల రిజర్వేషన్ శాతాన్ని పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధం కావాలన్నారు.




సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఈ సమావేశానికి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు అమీరుల్లా బేగ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూర్వపు అధ్యక్షులు స్వర్గీయ పిట్టా చంద్రపతిరావుకు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు కిల్లాన శ్రీనివాసరావు, బోజ్‌కుమార్, బాడాన దేవభూషణరావు, నర్తు నరేంద్ర యాదవ్, వాన కృష్ణచంద్, ఉమామహేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

పొందూరు: రాష్ట్రంలో విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మండలం కింతలిలో అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి విఆర్‌ఎలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు తెండేల త్రినాధరావు మాట్లాడుతూ తెలంగాణ మాదిరిగా పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన విఆర్‌ఎలకు విఆర్‌ఒగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీగా పనిచేస్తున్న విఆర్‌ఎలను విఆర్‌ఎగా గుర్తించాలని, జీతంతో కలిపి డిఎ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల విఆర్‌ఎల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పలాస : ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

ఉద్యోగోన్నతులపై వినతి

పలాస: విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని విఆర్‌ఎ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే గౌతు శిరీషకు నియోజకవర్గం పరిధిలోని విఆర్‌ఎలు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్‌ఎలను విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు 30 శాతం నుంచి 70 శాతం పెంచాలన్నారు. నామినీ విఆర్‌ఎలను రెగ్యులర్ విఆర్‌ఎలుగా కొనసాగించాలని కోరారు. అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లను రెగ్యులర్ రికార్డు అసిస్టెంట్లుగా 30 శాతం నుంచి 70 శాతం వరకు ఉద్యోగోన్నలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో మందస మండల తరుపున పిలక శ్రీనివాసరావు, దేశి సీతారాం, హరి లాభాల, కొత్తపల్లి మోహనరావు, పలాస మండలం నుంచి బొకర తిరుపతి, లక్ష్మణరావు, చల్లా సింహాచలం, వజ్రపుకొత్తూరు మండలం కంసు రాజేష్, ద్రౌపది, శ్యామల పాల్గొన్నారు.



పొందూరు : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎల సంఘసభ్యులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

అలరించిన ఘంటశాల గానలహరి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ జెడ్‌పి హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఘంటసాల గానలహరి, అవధానం సాంస్కృతిక కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగీతం దివ్యౌషధమని అన్నారు. అలనాటి ఘంటసాల, రఫీ, కిషోర్‌కుమార్, ముఖేష్ కుమార్‌ల గానామృతాలు మనలను నిద్రలోకి జారుకునేలా చేశాయన్నారు. అన్ని వయస్సుల వారంతా చక్కగా చేసిన గానామృత నృత్యాలు అలరించాయన్నారు. రహమతుల్లా ఆధ్వర్యాన విజయ నగరం వాస్తవ్యులు అలపించి వినిపించిన ఘంటశాల పాటలు, అవధానం సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యాంతం శ్రోతలను అలరించాయి. కార్యక్రమంలో ఎపి తెలుగు ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌నాయక్, ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, రహమతుల్లా, ఉమామహేశ్వరి, డాక్టర్ కణితి కేశవరావు, ఫయాజ్ అహ్మద్ (గని) తాళభద్ర, కాళిదాసు, సత్యానంద్, నౌగాపు దండాశి తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఫార్మాసిస్టులు

ఫార్మాసిస్టు పోస్టులు పెంచాలి

ప్రజాశక్తి- పలాస

ప్రజా వైద్యంలో మెరుగైన వైద్య సేవలు అందాలంటే ఫార్మాసిస్టు పోస్టులు పెంచాలని రాష్ట్ర అధ్యక్షులు జి.కోటేశ్వరరావు కోరారు. విజయవాడ కృష్ణలంక సిఐటియు కార్యాలయంలో రాష్ట్రస్థాయి ఫార్మసీ ఆఫీసర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందులు నిల్వ ఉంచేందుకు గదుల్లో సరైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎన్‌టిఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే నాణ్యమైన మందులు సరైన సదుపాయాలు కల్పించాలని, తద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ మహిధర్, జయలక్ష్మి, మాలతి, బి.ఎస్.నాయుడు, బోనేల గోపాలరావు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం లీగల్ సెల్ అధ్యక్షునిగా ఆగూరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం


నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న ఉమామహేశ్వరరావు

రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం లీగల్ సెల్ అధ్యక్షులుగా జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది, ప్రస్తుత జిల్లా బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమా మహేశ్వరరావు నియమితులయ్యారు. సోమవారం జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు లాకా వెంగళరావు ఆయనకు నియామకపు పత్రాన్ని అందజేశారు. గత కొన్నేళ్లుగా ఆయన బిసి సంక్షేమానికి కృషి చేస్తున్నారు. జిల్లా బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా ఉన్న ఆయన్ను రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షునిగా నియమించడంపై బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వాన కృష్ణచంద్, న్యాయవాదులు మామిడి క్రాంతి తదితరులు అభినందించారు.

అనురాగ నిలయంలో అన్నవితరణ

అరసవల్లి: జిల్లాకు చెందిన డాక్టర్ మందుల మోహనరావు జన్మదినం సందర్భంగా శాంతా కల్యాణ అనురాగ నిలయంలో పిల్లలకు, సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో సోమవారం వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. వృద్ధులు, పిల్లలకు ఆశ్రయం కల్పించి వారి జీవితానికి బాటలు వేసిన అనురాగ నిలయ కమిటీ సభ్యులకు అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కనుగుల దుర్గా శ్రీనివాసరావుతో పాటు, అనురాగ నిలయం నిర్వాహకులు లలిత, ఆర్.ఆశ, సాయి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం లో ఎన్‌ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్‌లో 2025 - 26 శుభారంభం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విశాఖ, విజయనగరం ఎంపిలు ఎం.భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి మారుమూల గ్రామంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగి, అధునాతన



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

సౌకర్యాలతో విద్యాసంస్థలు నెలకొల్పడంతో యాజమాన్య ప్రతినిధులు ఎమ్మెల్యే ఈశ్వరరావు, తేజబాబులను అభినందించారు. భవిష్యత్‌లో ఈ విద్యాసంస్థ ఉత్తరాంధ్రకే తలమానికంగా రూపొందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నాయన్నారు. స్కూల్ చైర్మన్ ఈశ్వరరావు మాట్లాడుతూ తాను ఈ ప్రాంత ప్రజలకు మంచి విద్యను అందించి మంచి సంస్థగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకుకొనసాగుతున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, డిఇఒ తిరుమల చైతన్య, ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు, స్థానిక సర్పంచ్ ఎన్.రజిని, ఎన్‌ఇఆర్ స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజబాబు, స్కూల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఊర్మిళ దీక్షిత్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాంబాబు, ఎజిఎం మాదవి లత, వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ బాలరాజు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- అరసవల్లి

జనవారధి ట్రస్ట్ అధ్యక్షులు గూడూరి శ్రీధర్ సూచనల మేరకు వేసవికాలం దృష్ట్యా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో బ్లడ్ బ్యాంకుకు వచ్చే దాతలకు, వారి సహాయకులకు న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకులో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా. టి. మణికంఠ సోమవారం అన్నారు. దాహార్తి సేవలో జనవారధి ట్రస్ట్ ముందుకు రావటం సంతోషకరమని, సుదీర్ఘ ప్రాంతాల నుంచి రక్తనిల్వల కోసం అధిక సంఖ్యలో దాతలు, వారి సహాయకులు వస్తుంటారని, వేసవితాప తీవ్రతతో వడదెబ్బ తగలే అవకాశాలు ఉండడంతో బ్లడ్ బ్యాంకు ప్రాంగణానికి వచ్చే దాతలు, సహాయకులకు మజ్జికను అందించి దాహార్తిని తీరుస్తున్నామన్నారు. బ్లడ్ బ్యాంకు ప్రాంగణంతో పాటు, ఆరుబయట జన సంచారం ఎక్కువ ఉండే ప్రదేశాల్లో ఉచిత మజ్జిగ సేవలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.వెంకట రమణ, సిబ్బంది, రక్తదాతలు, సహాయకులు పాల్గొన్నారు.

కవిటి: ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ యూనియన్ తమ ఔదార్యం చాటుకుంది. స్థానిక చింతామణి కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేసి సుమారు 3000 మందికి మజ్జిక పంపిణీ చేసింది. ఎమ్మెల్సీ రామారావు, జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ తదితరులు చలివేంద్రంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడు పొట్నూరి రాజశేఖర్ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గంతి శ్రీనివాస్, కార్యదర్శి రెల్ల నితిన్, కోశాధికారి కె.మురళి, గౌరవాధ్యక్షుడు నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆమదాలవలస : మజ్జిగతో బాటసారులు, ప్రజలు దాహార్తిని తీర్చుకోవాలని ఎస్‌ఐ సనపల బాలరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో నేతాజీ యూత్ సహకారంతో కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఎస్.బాలరాజు విచ్చేసి ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి చిన్ను, కిల్లి సతీష్, సిహెచ్ కృష్ణ మదన్, యస్వంత్, సిద్ధు, సుమంత్, సంతోష్, ప్రశాంత్, అశోక్, విక్రమ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని బెల్లుపడ కాలనీ యూత్ ఆధ్వర్యాన మెయిన్ రోడ్డు వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని పట్టణ ఎస్‌ఐ ముకుందరావు ప్రారంభించారు. ఉత్కళాంధ్ర సంప్రదాయం ప్రకారం పున సంక్రమణం రోజున పలు ప్రాంతాల్లో మజ్జిగ, పానకం పంపిణీ చేస్తుంటారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు సునీల్, పార్వతీశం, కుర్మాపు అయ్యప్ప, కుర్మాపు మణి, బాగి, రుషి, రవి, జి.సునీల్ పాల్గొన్నారు.


విద్యార్థులతో చైర్మన్ తులసీదాస్‌రెడ్డి

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఇచ్ఛాపురం : స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థల ప్రాంగణంతో కెజి విద్యార్థులతో గ్రాడ్యూషన్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి సరస్వతీదేవి చిత్రపటాన్ని పూలమాలు వేశారు. ఈ సందర్భంగా పిల్లల్లో ఉండే ఆసక్తి, ఉపాధ్యాయులతో, స్నేహితులతో ఎలా మెలగాలో వివరించారు. అనంతరం మెమోంటోలు, ధ్రువపత్రాలను అందజేవారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కో-ఆర్డినేటర్ చాట్ల నిలిమారెడ్డి, చైర్‌పర్సన్ చాట్ల తులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉపన్యాసాలు, సాంకేతిక ప్రదర్శనలు, నృతాల అలరించాయి.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ఎచ్చెర్ల : మండలం తమ్మినాయుడుపేట యూనిట్‌లో సోమవారం 200 కేజీల ఘన జీవామృతం తయారు చేశారు. ఘన జీవామృతం తయారీ విధానం, ఉపయోగాలను తమ్మి నాయుడుపేట సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపిటిసి వావిలపల్లి రామారావు, మాజీ సర్పంచ్ రామకృష్ణ, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొని వాటి ఉపయోగాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి వై.చంద్రకళ మాట్లాడుతూ ఎరువులు, డిఎపికి బదులుగా ఘన జీవామృతం వాడకంతో తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి కాంచన, రైతులు పాల్గొన్నారు.


ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యేను కలిసి వెల్ఫేర్ అసిస్టెంట్లు

పలాస : సచివాలయల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సంక్షేమ, విద్యా ఉద్యోగుల (161/2024) సంఘం నాయకులు కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను సోమవారం కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని, తమకు ఉద్యోగరీత్యా ఉద్యోగోన్నతులు కల్పించేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సాంఘీక సంక్షేమశాఖ మంత్రి దృష్టికి ఉద్యోగుల


వినతిపత్రం అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

సమస్యలను తీసుకుని వెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో కంచరాన చాణక్య, బి.రమేష్, ఈగల తిరుపతిరావు, బి.ధనుంజయ, కె.గణపతి, డి.నారాయణ, జి.తిరుపతిరావు ఉన్నారు.


అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సముద్ర తాబేళ్లను సంరక్షించాలి

ప్రజాశక్తి- పలాస

సముద్ర తాబేళ్లను సంరక్షించడం ద్వారా జీవ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణ విద్యార్థులకు సూచించారు. మండలంలోని బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు జాతీయ హరితదళ క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యాన వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులోని అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ ఇండియా సంయుక్తంగా నిరహిస్తున్న ఆలివ్ రిడ్లీ సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ముందుగా విద్యార్థులు తీరంలోని వ్యర్థాలను ఏరి బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన హేచరిల్లో పొదిగిన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల పిల్లలను వజ్రపుకొత్తూరు బిటిఒ టి.తిరుపతిరావు, ట్రీ ఫౌండేషన్ వాలంటీర్ షేక్ ఖాసిం సమక్షంలో సముద్రంలోకి విడిచి పెట్టారు. మత్స్య సంపద పెరుగుదలకు తాబేళ్ల ప్రాధాన్యతను, వాటి సంరక్షణ ఆవశ్యకతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌జిసి క్లస్టర్ సమన్వయకర్త కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.పద్మ, బి.సుధాకుమారి పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

ప్రజాశక్తి- కవిటి

మేష సంక్రమణం సందర్భంగా మండలంలోని దేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కవిటి చింతామణి అమ్మవారు, కుసుంపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లోని సింధుపురాణి అమ్మవారు, రాజపురం సంతోషి మాతా, బొరివంక కాళీ మాత, కవిటి రాజపురం మార్గంలోని కాళీ మాత ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు, జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల, కళింగ కార్పొరేషన్


దర్శించుకుంటున్న విజయ

డైరెక్టర్ జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య సందర్శించుకున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రసాదరావు

ఇంటర్ విద్యలో గ్లోబల్ విద్యాసంస్థల తొలి అడుగు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గ్లోబల్ విద్యాసంస్థలు ఇంటర్మీడియట్ విద్యను ప్రారంభించి తొలి ఏడాదిలో ఉత్తమ ఫలితాలను సాధించిందని సంస్థ చైర్మన్ ఎం.ప్రసాదరావు తెలిపారు. సోమవారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. జూనియర్ బైసిపి విభాగంలో 440 గాను 434 మార్కులు సాధించి జిల్లాలోనే అగ్రబాగాన నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.


మోహనరావును సన్మానిస్తున్న రామరాజు

మాజీ ఎమ్మెల్యే జన్మదినం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని నివగాంలోని మాజీ ఎమ్మెల్యే కలమట మోహనరావు జన్మదిన వేడుకలు పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎద్దు సుందర నారాయణ నాయుడు, వరహాలమ్మ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎద్దు గోపాలదాసునాయుడు, మాజీ సర్పంచ్ టంకాల రమణారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ తూతికి ఆదినారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దేశ స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని ప్రజల కోసం నిరంతరాయంగా పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పలువురు విశ్రాంత ఉద్యోగులు అన్నారు. నగరానికి చెందిన బి.సంజీవరావు, గార మండలానికి చెందిన బొగ్గురాము తదితర నాయకులతో కలిసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

పోలాకి మాజీ సర్పంచ్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి లుకలాపు రాంబాబు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ డోల జగన్, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, చిట్టి సింహాచలం, సూరపు నాని ఉన్నారు.